క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలి


భగవద్గీత ప్రచార కార్యక్రమంలో ప్రభోదసేవా సమితి సభ్యులు

వి.కోట: ప్రతి ఒక్కరూ భగవద్గీతను పఠించాలని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక సభ్యులు తెలిపారు. వారు ఆదివారం ఆదినేపల్లి, పెద్దభర్నిపల్లి, కారకుంట గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, ప్రకాష్, శరవణ, కృష్ణమూర్తి, లోకేష్, మైత్రి, వెంకటలక్ష్మి, జలజాక్షి, వాణి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి


సమస్యలు తెలుసుకుంటున్న బీపీఎం శివశంకర్

పెద్దపంజాణి: మండలంలోని కొళత్తూరులో మౌలిక వసతులు లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పలమనేరు ఇన్‌చార్జి బీపీఎం శివశంకర్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం పల్లె పల్లెకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా కొళత్తూరులో పర్యటించారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ మురుగు కాలువలు అధ్వానంగా వున్నాయని, రోడ్డు దుస్థితికి చేరుకుందని తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని శివశంకర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ అధ్యక్షుడు దొరస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ కుమార్, రెడ్డెప్ప, లక్ష్మణ్, చిన్నమల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

నా భర్త బతికే ఉన్నారు.. బియ్యం ఇవ్వండి సారూ..!


భర్త రమణతో రెడ్డిదీప

రొంపిచెర్ల: 'నా భర్త బతికే ఉన్నారు. రేషన్ కార్డులో పేరు నమోదు చేసి బియ్యం ఇవ్వండి సారూ' అని చిన్నగొట్టిగల్లు మండల చట్టివారిపాళ్యంకు చెందిన రెడ్డిదీప కోరుతోంది. చట్టివారిపాళ్యంకు రమణ, రెడ్డిదీప రొంపిచెర్ల మండలం బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని రామచంద్రాపురం కాలనీలో కాపుమున్నారు. వీరికి కుమారుడు సతీష్‌కుమార్(17), కుమార్తె అశ్విని(16) ఉన్నారు. వీరు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. రమణ చనిపోయాడని బియ్యం కార్డులో పేరు తొలగించారు. దీంతో బియ్యం రావడం లేదు. తన భర్త బతికే ఉన్నాడని రెడ్డిదీప పలుమార్లు అధికారులకు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. తన భర్త పేరును రేషన్ కార్డులో చేర్చి బియ్యం ఇవ్వాలని ఆమె కోరుతోంది. అలాగే తన పిల్లలకు తల్లికి వందనం కూడా రాలేదని వాపోతోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతోంది.

రాజశేఖర దీక్షితులకు శైవాగరత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న రాజశేఖర దీక్షితులు

చౌడేపల్లె: స్థానిక అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు రాజశేఖర దీక్షితులు శైవాగరత్న అవార్డు అందుకున్నారు. బెంగళూరు నగరం గవిపురం ఛత్రంలో ఆదివారం జరిగిన శ్రీకుంఠ శివాచార్య గురుపూజను పురస్కరించుకుని శైవాగంలో ఉత్తీర్ణులైన పలువురు ఆగమికులను సత్కరించారు. రాజశేఖరదీక్షితులు ఆగమికులుగా పరంపరను కొనసాగిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన సువర్ణ కర్ణాటక మండలి అధ్యక్షుడు మధుసూదనాంధపురి అవార్డు అందజేశారు. గౌరవాధ్యక్షులు సోమ సుందర పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీసు స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం సాయంత్రం విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొంది. దీంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. నలుగురు యువకులు జాండ్లవారిపల్లె పంచాయతీ దుస్సావాండ్లపల్లెలో జరిగిన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ స్నేహితుడిని రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో వదిలి రావడానికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో రొంపిచెర్ల పోలీసు స్టేషన్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో కారు దెబ్బతింది. కారులో వున్న జశ్వంత్ (24) తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు 108లో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రొంపిచెర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైతన్నలకు అందని సేవలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన పలు యూనిట్లు పనిచేయడం లేదు. పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, సరుకు నాణ్యంగా ఉండేలా యంత్రాల సాయంతో గ్రేడింగ్, ప్యాకింగ్ తదితర ప్రక్రియల ద్వారా మంచి ధర కల్పించేలా నిర్మించిన ఆహార శుద్ధి పరిశ్రమలు మూలనపడ్డాయి. శీతల గిడ్డంగులు పనిచేయడం లేదు. టమాటా విలువ ఆధారిత పరిశ్రమలు పనిచేయడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- సేవలందించని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు
- పనిచేయని టమాటా విలువ ఆధారిత యూనిట్లు
- ఖాళీగా వున్న కోల్డ్ స్టోరేజీ
- వృథాగా మారిన గోదాములు
- మూతపడిన వైఎస్సార్ అగ్రి ల్యాబ్



మూతపడిన గంగవరం మండలంలోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, నిరుపయోగంగా మారిన బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లి వద్ద నిర్మించిన మల్టీపర్పస్ గోడౌన్

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఎక్కువగా టమాట పండిస్తారు. అలాగే బీన్స్, వంగ, బెండ, ఉర్లగడ్డలు తదితర కూరగాయలతోపాటు మామిడి తోటల సాగు కూడా వుంది. రైతులు పండించిన పంటలకు స్థానికంగా సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో గత ప్రభుత్వం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఆపరేషన్ గ్రీన్స్ ప్రోగ్రాం ద్వారా ఎంవోఎఫ్‌పీఐ(మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రైమరీ ఇండస్ట్రీస్ ఈ ఆహారశుద్ధి పరిశ్రమలు నెలకొల్పింది. పలమనేరు నియోజకవర్గంలోని గంగవరం మండలం అటుకురాళ్లపల్లి, బైరెడ్డిపల్లి మండలం చప్పిడిపల్లి టమాటా ఆధారిత యూనిట్లను నిర్మించారు. ఇవి సంబంధిత ప్రాంతాల్లోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా వారు పండించిన పంటలను నమోదు చేసుకుంటారు. పలు రాష్ట్రాలకు చెందిన బహుళజాతి సంస్థలు, హోటళ్లు, మాల్స్, కార్పొరేట్ కళాశాలల హాస్టళ్లు, క్యాంటీన్లు, రిలయన్స్ తదితర కంపెనీలకు అవసరమైన నాణ్యమైన కూరగాయల ఇండెంట్‌ను సేకరించేవారు. వారి అవసరాల మేరకు ఇక్కడి రైతుల ఉత్పత్తులను సేకరించి ఇక్కడి యూనిట్లలో యంత్రాల ద్వారా గ్రేడింగ్ చేసి, ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసి వారికి చేరవేసేవారు. సరుకు నాణ్యంగా ఉండడం వల్ల రైతులకు మంచి ధర దక్కేది. దీంతోపాటు మార్కెట్‌లో లాగా కమీషన్ పట్టుకోకుండానే నగదు చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చప్పిడిపల్లి, గంగవరం మండలంలోని అటుకురాళ్లపల్లి యూనిట్లు మూతపడ్డాయి. పలమనేరు ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో వున్న యూనిట్ మాత్రం తూతూమంత్రంగా సాగుతోంది.

దెయ్యాలకు నిలయంగా మారిన శీతల గిడ్డంగులు

రైతులు ఎక్కువగా పండించే టమాటా, ఉర్లగడ్డలు, చింతపండు తదితర పంటలకు ధర లేనప్పుడు ఏసీ గోదాముల్లో నిల్వ ఉంచుకునేలా గత ప్రభుత్వం ఇక్కడ శీతల గిడ్డంగులను నిర్మించింది. రైతులు తాము పండించిన పంటలను ఇక్కడ నిల్వ ఉంచి ధర ఉన్నప్పుడు విక్రయించుకోవడం ద్వారా నష్టాల నుంచి బయటపడేవారు. ఇందుకుగాను రైతుల నుంచి నామమాత్రంగా రుసుము వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శీతల గిడ్డంగులను ఎవరూ వినియోగించడం లేదు.

పిచ్చిమొక్కలతో మల్టీపర్పస్ గోదాములు

గత ప్రభుత్వం నియోజకవర్గంలోని రైతుల కోసం 16 మల్టీపర్పస్ గోదాములను నిర్మించింది. ఒక్కోదానికి రూ.40 లక్షలు ఖర్చు చేసింది. రైతులు పండించిన పంటలను వీటిలో నిల్వ ఉంచుకోవడంతోపాటు ఫర్టిలైజర్ యంత్రాలు, వ్యవసాయ పరికరాలను భద్రపరుచుకునేవారు. కూటమి పాలనలో వృథాగా మారాయి. గోదాముల వద్ద పిచ్చిమొక్కలు మొలిచాయి.

సేవలందించని వైఎస్సార్ అగ్రిల్యాబ్

పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో గత ప్రభుత్వం వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను నిర్మించింది. ఇందులో రైతులు విత్తనాలు, ఎరువుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకోవచ్చు. అదే విధంగా పశువులకు సోకే వ్యాధులను నిర్ధారించుకోవచ్చు. తద్వారా జిల్లా కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా పోయింది. ఇప్పుడు ఈ కేంద్రాల్లో పనిచేసే సిబ్బందిలేక సేవలందడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వంలో రైతన్నల కోసం ఇలా...

నియోజకవర్గంలోని విజిటబుల్ ప్రాసెసింగ్ యూనిట్లు	2
ఇందుకోసం ఖర్చు చేసిన మొత్తం	రూ.11 కోట్లు
నియోజకవర్గంలోని మల్టీపర్పస్ గోడౌన్లు	16
నిర్మాణం పూర్తయినవి	8
ఒక్కో గోడౌన్‌కు ఖర్చు చేసిన మొత్తం	రూ.40 లక్షలు
వైఎస్సార్ అగ్రిల్యాబ్ నిర్మాణం కోసం	రూ.50 లక్షలు


ఖాళీగా మారిన శీతల గిడ్డంగి

రైతులకు ఎలాంటి సౌకర్యాలు లేకుండా పోయాయి


నాకు పదెకరాల పొలం వుంది. పలురకాల పంటలు సాగు చేస్తున్నాం. నేను రైతు సమాఖ్యలోనూ సభ్యుడిగా ఉన్నా. గత ప్రభుత్వంలో రైతుల కోసం రెండు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నిర్మించింది. వాటిల్లో పంటలను ఎక్కువ ధరకు అమ్ముకునేవాళ్లం. అక్కడి ఏసీ గోడౌన్లలో సరుకు నిల్వ ఉంచేవాళ్లం. ఈ ప్రభుత్వంలో ఏమీ లేకుండా పోయాయి.

-కల్లాడు సుబ్బన్న, ఆదర్శ రైతు, కల్లాడు గ్రామం

ఉన్న వసతులను వాడుకున్నా చాలు


గత ప్రభుత్వం ఇక్కడ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కోల్డ్ స్టోరేజీలు, అన్ని మండలాల్లో గోడౌన్లు నిర్మించింది. అవన్నీ ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. పలమనేరులో కట్టిన వైఎస్సార్ అగ్రిల్యాబ్ పనిచేయడం లేదు. రైతులకు సౌకర్యంగా వున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రైతులు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని తెలిసి ఈ నిర్లక్ష్యమెందుకు.

-గోవిందురెడ్డి, ఆత్మా మాజీ చైర్మన్, బేరుపల్లి

భక్తిశ్రద్ధలతో కావళ్ల సమర్పణ


వి.కోట: దాసార్లపల్లిలో కావళ్లు చెల్లిస్తున్న భక్తులు

వి.కోట: ఆడికృత్తిక సందర్భంగా ఆదివారం వి.కోట మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పలువురు భక్తులు కావళ్ల చెల్లించారు. దాసార్లపల్లి గ్రామ సమీపంలోని సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు కావళ్ల చెల్లింపులు చేపట్టారు. నాయకనేరి వద్ద గల బీసీపల్లి పంచాయతీ సీవీఆర్‌కొండపై వెలసిన సుబ్రమణ్య స్వామి, ఆకువారిపల్లి క్రాస్ వద్ద గల వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శంకు చక్రధారిణిగా చాముండేశ్వరిదేవి


విశేషాలంకరణలో పటాలమ్మ

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి ఆదివారం శంకు చక్రధారిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. చాముండేశ్వరిదేవి జయంతి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలో ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకుని దీపాలు వెలిగించారు.

పటాలమ్మకు ప్రత్యేక పూజలు

రామసముద్రం రోడ్డులో వెలసిన పటాలమ్మకు ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు బాగా కురిసి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. వేదపండితులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు


చౌడేపల్లెలో మాట్లాడుతున్న నాగభూషణరెడ్డి, దామోదరరాజు


నడుమూరులో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి

- డైవర్షన్ పాలిటిక్స్ చంద్రబాబు నైజం
- అక్రమ కేసులతో పెద్దిరెడ్డి కుటుంబానికి వేధింపులు
- ప్రజలు గుణపాఠం చెప్పడం తథ్యం

చౌడేపల్లె: సూపర్ సిక్స్‌తోపాటు పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.నాగభూషణరెడ్డి ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. ఇందులో భాగంగానే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని లక్ష్యంగా తీసుకుని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై మద్యం కేసు బనాయించి అరెస్టు చేయించారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు పరిపాలనలో ఘోరంగా విఫలమయ్యారని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనకబడిందని, ఈ క్రమంలో ప్రజల దృష్టిని మరలించడానికి వైఎస్సార్ సీపీ కీలక నేతలపై అక్రమ కేసులు నమోదుచేసి జైలుకు పంపుతున్నారని విమర్శించారు. పెద్దిరెడ్డి కుటుంబంపై మదనపల్లె ఫైల్స్ దగ్ధం, అటవీ భూముల ఆక్రమణ అంటూ లేనిపోని ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. వాటిలో ఏమీ తేలకపోవడంతో ఇప్పుడు తప్పుడు కేసులు బనాయించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకాలు, దౌర్జన్యాలు, అవినీతిని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. అక్రమ మద్యం కేసు నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దామోదరరాజు, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ ఎంపీపీలు రుక్మిణమ్మ, అంజిబాబు, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, నేతలు నాగరాజ, షంషీర్, సాధిక్‌బాషా, వెంకటరమణ, రమేష్‌బాబు, రాజశేఖర్‌రెడ్డి, కళ్యాణ్ భరత్, పవన్‌కుమార్, సదా, చిన్న, విజయ్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తప్పుడు కేసులతో వేధింపులు మంచిదికాదు

ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసు పెట్టి కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం తగదని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం నడుమూరులో విలేకరులతో మాట్లాడారు. పెద్దిరెడ్డి కుటుంబంపై బురదజల్లడమే ధ్యేయంగా పెట్టుకున్నారని ఆరోపించారు. వారికి వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేకే కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరలేపిందన్నారు. ప్రజలు తగిన రీతిలో సమాధానమిస్తారని తెలిపారు. నాయకులు కిషోర్‌బాబు, వెంకటేష్, మణిరాజు, రామ్మూర్తి, రాజు పాల్గొన్నారు.

రోడ్డులోని గుంతలు పూడ్చాలని నిరసన


రోడ్డులోని గుంతలను చూపుతున్న వెంకట్రమణారెడ్డి, రామమూర్తి

పుంగనూరు: పుంగనూరు నుంచి బెంగళూరు వెళ్లే రోడ్డు గుంతలమయం కావడంతో ప్రయాణం దుర్భరంగా మారిందని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి వెంకట్రమణారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం రోడ్డులోని గుంతలను పూడ్చాలని కోరుతూ నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పుంగనూరు–బెంగళూరు రోడ్డులో సుమారు 6 కిలోమీటర్ల వరకు పెద్ద పెద్ద గుంతలు పడ్డాయని తెలిపారు. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గర్భిణులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి సంవత్సరం పూర్తయినా రోడ్లలోని గుంతలు పూడ్చేందుకు ముందుకు రాకపోవడంతో సిగ్గుచేటన్నారు. రోడ్డు మరమ్మతులు చేయకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి రామమూర్తి, రాము పాల్గొన్నారు.

ఘనంగా ఆడికృత్తిక ఉత్సవాలు



విశేషాలంకరణలో వళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, ఆలయం వద్దకు వస్తున్న భక్తులు

గుడుపల్లె: మండలంలోని గుడివంకలో వెలసిన శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఆదివారం ఆడికృత్తిక ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు వివిధ రకాల కావళ్లను ఎత్తుకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. గుడివంకలోని పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి హరో హర వేల్ మురుగ అంటూ పశ్చిమ వాహిని కొండపైకి చేరుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చాలని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి స్వామి వారి ధ్వజస్తంభం వద్ద కావళ్లు ముడుపులు చెల్లించారు. అనంతరం శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

బైక్ బోల్తాపడి ఇద్దరికి తీవ్ర గాయాలు

చౌడేపల్లె: మండలంలోని కాగతి యల్లంపల్లె వద్ద ఆదివారం బైక్ అదుపుతప్పి బోల్తాపడడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. ఓబిరెడ్డిపల్లెకు చెందిన విశ్వనాథ, మోహన్ బైక్‌లో బోయకొండ వెళ్లారు. అమ్మవారిని దర్శించుకుని ఇంటికి బయలుదేరారు. కాగతియల్లంపల్లె వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెద్దిరెడ్డిపై కక్షతోనే మిథున్‌రెడ్డిపై కేసు!

- సీఎం కావాలనే తిరుపతి వచ్చారు
- చిత్తూరు జిల్లాలో పెద్దిరెడ్డి ఆధిక్యాన్ని చూసి బాధ
- పీఎల్ఆర్‌లో రూ.5 కోట్ల లావాదేవీలు తప్పా
- తప్పుడు కేసుపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం

పలమనేరు/చౌడేపల్లె: కాలేజీ రోజుల నుంచి తనకు శత్రువుగా ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఉన్న కసితో ఆయన తనయుడైన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిపై చంద్రబాబు అక్రమ కేసు బనాయించారని పలమనేరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు, పలువురు మేధావులు ఆరోపించారు. చంద్రబాబునాయుడు నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా తన సొంత జిల్లా చిత్తూరుకు ఏమీ చేయలేదని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జిల్లా అభివృద్ధికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ఎంతో కృషి చేశారని, అందువల్లే వారికి జనాలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. వారికి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేక చంద్రబాబు లిక్కర్ కేసులో అన్యాయంగా ఇరికించారని విమర్శించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, తగిన సమయంలో బుద్ధి చెబుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల వరకే రాజకీయాలు వుండాలని, తర్వాత అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవుపలికారు.

సిట్ విచారణ సవ్యంగా లేదు


లిక్కర్ స్కామ్‌పై ఎవరో లేఖ రాయడం, దానిపై వారం రోజుల్లోనే అంతర్గత విచారణ జరగడం, దీనిపై సీబీఐ, సిట్‌లు విచారణ చేయడం చూస్తుంటే అంతా అద్భుతంగా ఉంది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఈ జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం అండగా ఉందనే కారణంతోనే వీరిపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం కరెక్ట్ కాదు.

– సోమచంద్రారెడ్డి, మేధావుల ఫోరం జిల్లా అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వానిది పైశాచిక ఆనందం


వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ కూటమి ప్రభుత్వం పైశాచిక ఆనందం పొందుతోంది. ఇందులో భాగంగానే ప్రజాదరణ ఉన్న పెద్దిరెడ్డి కుటుంబంపై అక్రమ కేసులు పెడుతూ వేధిస్తోంది. ఎన్ని కేసులు పెట్టినా మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకొస్తారు.

–మిద్దింటి కిషోర్‌బాబు, కాపు యువత రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, చౌడేపల్లె

కూటమి అక్రమాలను ప్రజలు గమనిస్తున్నారు


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్ట్ అన్యాయం. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారు. -ఎస్. దామోదరరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, చౌడేపల్లె

కడిగిన ముత్యంలా బయటికొస్తారు


వైఎస్సార్‌సీపీకి జనంలో వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేకే మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు పెట్టారు. ఏడు కేసుల్లో బెయిల్‌పై ఉన్న చంద్రబాబు తాను సచ్ఛీలుడినని చెప్పుకుంటూ ఇతరులపై బురదజల్లుతున్నారు. మద్యం కేసు కోర్టులో నిలబడదు. మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటికి వస్తారు. -హేమంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్, పలమనేరు

చంద్రబాబు ఐదు కేసుల్లో బెయిల్‌పై ఉన్నారు


సీఎం చంద్రబాబు ఐదు కేసుల్లో బెయిల్‌పై ఉన్నారు. ఇది సామాన్య ప్రజలకు సాధ్యమవుతుందా. పెద్దోళ్లకు ఒక న్యాయం, సామాన్యులకు మరో న్యాయం ఉంటుందా. దీనిపై మాట్లాడేవాళ్లే లేరా. ఎంపీ మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసు పెట్టి ఇబ్బందులకు గురిచేయాలని అందరికీ అర్థం అవుతోంది. -యువరాజ్, ఎంపీపీ, వీకోట

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే


అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక జనాన్ని ఏమార్చేందుకు చంద్రబాబునాయుడు కుయుక్తులు పన్నుతున్నాడు. లిక్కర్ కేసు తప్పుడు కేసని జనానికి తెలుసు. ఎంపీ మిథున్‌రెడ్డి జగనన్నకు సన్నిహితంగా ఉన్నాడనే కారణంతోనే కేసులో అన్యాయంగా ఇరికించారు.

– శేఖర్, నాయుడు, పలమనేరు

తప్పుడు కేసులను జనం నమ్మరు


లిక్కర్ విక్రయాల్లో కుంభకోణం జరిగిందని ఎవరో చెప్పారని వైఎస్సార్ సీపీ నాయకులపై కేసులు పెడుతున్నారు. తప్పుడు కేసులకు భయపడే ప్రసక్తే లేదు. ఈ కేసును ఎందుకు పెట్టించారో జనానికి పూర్తిగా అర్థమైంది. ఎవరి లాభం కోసమో సిట్ ఇలా వ్యవహరిస్తుందనే విషయం అందరికీ తెలుసు.

– బాగారెడ్డి, మండల కన్వీనర్, పెద్దపంజాణి

ఆధారాలు లేని కేసులు నిలబడతాయా


ఆధారాలు లేని కేసులు ఎట్టి పరిస్థితుల్లో న్యాయస్థానాల్లో నిలబడవు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని గతంలో సిట్ అధికారులు విచారించి మళ్లీ కేసు పెట్టారంటే చంద్రబాబు మెప్పు కోసమేనని అర్థమవుతోంది. ఇలాంటి తప్పుడు కేసులకు వైఎస్సార్ సీపీ నేతలు భయపడే ప్రసక్తేలేదు. – సుబ్రమణ్యం నాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్

కసితోనే తప్పుడు కేసులు


కసితోనే మిథునన్నపై కేసు పెట్టి అరెస్ట్ చేయించారు. ఇందులో ఆయనకు ఎలాంటి సంబంధం లేదని గతంలో సిట్ అధికారుల విచారణలో తేలింది. ఏదో సాధించాలనే మళ్లీ టార్గెట్ చేసి కేసులో ఇరికించారు. ఆయన న్యాయస్థానం నుంచి కడిగిన ముత్యంలా బయటికి రావడం తథ్యం.

– చంద్రశేఖర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంట్, వి.కోట